నమస్తే తెలంగాణ
జగిత్యాల
5 | కరీంనగర్, గురువారం 24 అక్టోబర్ 2024 | JAGTIAL



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

# బకాయిలు విడుదల చేయండి

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి హెచ్చరిక
- కరీంనగర్‌లో భారీ ర్యాలీ, కలెక్టరేట్ ఎదుట ధర్నా

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 23 : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి డిమాండ్ చేశారు. నిర్లక్ష్యం చేస్తే రేవంత్‌రెడ్డి సర్కారుపై మిలిటెంట్ పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఏఐఎస్ఎఫ్ కరీంనగర్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ తీశారు. అనంతరం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి, మాట్లాడారు. ఫీజు బకాయిల విడుదలపై ఆనాడు రేవంత్‌రెడ్డి చెప్పిందేంటి?, నేడు చేస్తున్న జాప్యం ఏంటి? అని ప్రశ్నించారు. విద్యాశాఖను కూడా తన వద్దే పెట్టుకున్న రేవంత్‌రెడ్డి ఆ శాఖకు నిధులు కేటాయించి విద్యార్థులకు ఖర్చు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఫీజు బకాయిలను ఈ నెల 27 లోగా విడుదల చేయకపోతే 'చలో ఇందిరాపార్క్' నిర్వహిస్తామని, వేలాది మంది విద్యార్థులతో హైదరాబాద్ దిగ్బంధనం చేస్తామని, సచివాలయం ముట్టడిస్తామని స్పష్టం హెచ్చరించారు. ఇక్కడ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామారపు వెంకటేశ్, మచ్చ రమేశ్, నాయకులు మామిడిపల్లి హేమంత్, కేశబోయిన రాము, కనకం సాగర్, లద్దునూరి విష్ణు, కసిరెడ్డి సందీప్‌రెడ్డి, కౌశిక్, ఛత్రపతి, వినయ్, శ్రావణ్, ఈశ్వర్, రిషి పాల్గొన్నారు.

# ప్రైవేట్ మెడికల్ షాపులో ఈఎస్ఐ మెడిసిన్

- కరీంనగర్‌లో బట్టబయలు చేసిన డీసీఏ అధికారులు
- ₹4.87 లక్షల విలువైన ఔషధాలు సీజ్

సిటీబ్యూరో, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ఈఎస్ఐ డిస్పెన్సరీలలో రోగులకు అందించాల్సిన మందులను పక్కదారి పట్టిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ మెడికల్ షాపుల్లో విక్రయిస్తున్నారు. తాజాగా డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు కరీంనగర్‌లోని ఓ మెడికల్‌షాప్‌పై దాడులు చేసి, లక్షల విలువైన ఔషధాలను సీజ్ చేశారు. డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి వివరాల ప్రకారం.. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్, సిర్పూర్‌లోని ఈఎస్ఐ డిస్పెన్సరీలో గ్రేడ్-2 ఫార్మసిస్ట్‌గా విధులు నిర్వర్తిస్తున్న దునబోయిన మురళీరావు మార్కెట్ కంటే తక్కువ ధరలకు ఈఎస్ఐ మందులు విక్రయించేందుకు కరీంనగర్‌లోని శ్రీశ్రీనివాస మెడికల్ అండ్ జనరల్‌స్టోర్ మేనేజింగ్ పార్ట్‌నర్ గంప కృష్ణతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. డిస్పెన్సరీలో రోగులకు ఇవ్వాల్సిన మందులను ఈ జనరల్‌స్టోర్‌కు దారి మళ్లిస్తున్నాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న డీసీఏ అధికారులు ఆ షాప్‌పై దాడులు చేశారు. అందులో ₹4.87 లక్షల విలువైన ఐదు రకాల యాంటీ డయాబెటిక్, యాంటి ఆస్తమాటిక్ ఔషధాలను సీజ్ చేశారు. దాడుల్లో అసిస్టెంట్ డైరెక్టర్ ఎం శ్రీనివాసులు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పీ కార్తీక్ భరద్వాజ్, టీ చందన, పీ శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

# ఐకేపీ కేంద్రంలోనే దళారీ కాంటా



ధాన్యం కొనుగోలు కేంద్రంలో దళారీ వాహనం

ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 23: ధాన్యం కొనుగోళ్లలో జాప్యంతో దళారులు రంగంలోకి దిగుతున్నారు. ఓ వైపు వర్షం పడుతుండడం, మరోవైపు కేంద్రాల్లో కొనకపోవడాన్ని ఆసరాగా చేసుకుంటున్నారు. కల్లాల వద్దే కాదు, ఏకంగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే కాంటా పెడుతున్నారు. ఇలానే ఎల్లారెడ్డిపేట ఐకేపీ కొనుగోలు కేంద్రంలో ఓ దళారీ తన వాహనం పెట్టి వడ్లు కొనగా, సెంటర్ నిర్వాహకుల ఫిర్యాదుతో తహసీల్దార్ సదరు వాహనాన్ని సీజ్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. వారం క్రితం ఎల్లారెడ్డిపేటలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అయితే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించకపోవడం, రెండుమూడు రోజులుగా అకాల వర్షం పడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదే అదునుగా ఓ దళారీ కొనుగోలు కేంద్రంలోనే కాంటా పెట్టాడు. మద్దతు ధర క్వింటాల్‌కు ₹2,300 ఉండగా, ₹1,870 చొప్పున కొని, తన వాహనాన్ని పెట్టి లోడ్ చేయించాడు. దీంతో ఐకేపీ నిర్వాహకులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఆర్ఐ సంతోష్ సదరు దళారీ వాహనాన్ని తహసీల్ ఆఫీస్‌కు తరలించి సీజ్ చేశారు. రెండు, మూడు రోజుల నుంచి రోజూ వానొస్తున్నదని రైతులు వాపోయారు. ప్రభుత్వం సకాలంలో వడ్లు కొంటే తామెందుకు మధ్య దళారీలకు అమ్ముతామంటూ వారు అసహనం వ్యక్తం చేశారు.

# పోలీసుల రక్తదానం



రక్తదానం చేస్తున్న సీపీ అభిషేక్ మొహంతి

రాంనగర్, అక్టోబర్ 23 : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంలోని పరేడ్ గ్రౌండ్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. సీపీ అభిషేక్ మొహంతి శిబిరాన్ని ప్రారంభించి, ముందుగా రక్తదానం చేశారు. దాదాపు 200 మంది రక్తదానం చేశారు. కాగా, గన్నేరువరం మండలం జంగపల్లి గ్రామానికి చెందిన కోతి శ్రీనివాస్ అనే దినసరి కూలి స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచాడు. చేపలు పడుతూ జీవనం సాగించే అతను పోలీసు శాఖపై ఉన్న అభిమానంతో తన భార్యా, ఇద్దరు పిల్లలతో సహా శిబిరానికి వచ్చాడు. ఈ విషయం తెలుసుకున్న సీపీ అభిషేక్ మొహంతి శ్రీనివాస్‌తో పాటు అతని కుటుంబ సభ్యులను తన కార్యాలయానికి పిలిపించి అభినందించారు.

# ఇందిరమ్మ కమిటీల్లో ఢీ అంటే ఢీ



- ఉమ్మడి జిల్లాలో 11,646 ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు
- మెజార్టీ నియోజకవర్గాల్లో రచ్చ
- 70 శాతం వార్డులు, డివిజన్లలో డబుల్ జాబితాలు
- జగిత్యాల, కరీంనగర్‌లో తారాస్థాయికి విభేదాలు
- కమిటీలో స్థానం పొందేందుకు అధినేతల చుట్టూ ప్రదక్షిణలు
- కొన్నిచోట్ల కొత్తవారికే చాన్స్.. మండిపడుతున్న పాత కాంగ్రెస్ నాయకులు



**ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు కాంగ్రెస్‌కు కొత్త వివాదాలను తెచ్చిపెడుతున్నది. ఈ కమిటీల్లో చోటు కోసం పార్టీలో వివిధ వర్గాలు 'ఢీ అంటే ఢీ' అనే పరిస్థితి కనిపిస్తున్నది. అందులో భాగంగానే మెజార్టీ వార్డులు, డివిజన్ల నుంచి రెండు, మూడు జాబితాలు అధికారులకు చేరగా.. 'అవకాశం నాకంటే నాకే ఇవ్వాలి' అని ఆయా వర్గాలు పట్టుపడుతున్న తీరు ప్రస్తుతం పార్టీకి తలనొప్పిలా మారుతున్నది. కొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు కొత్త వారికి అవకాశం కల్పిస్తూ పాతవారికి పాతరేస్తున్నారన్న విమర్శలు వస్తుండగా.. అధికారిక జాబితా వెలువడితేనే అసలు వ్యవహారం బయట పడనున్నది. కమిటీల్లో స్థానం కోసం పోటాపోటీ ఉన్న నేపథ్యంలో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు ఆయా జాబితాలను కలెక్టర్‌కు పంపించగా, సదరు జాబితాలను కలెక్టర్ నేరుగా ఇన్‌చార్జి మంత్రికి పంపినట్టు తెలుస్తున్నది. మరోవైపు కొంతమంది నాయకులు నేరుగా ఇన్‌చార్జి మంత్రిని కలిసి జాబితాను సమర్పించినట్టు తెలుస్తుండగా, ఈపరిణామాలు ఎటువైపు దారి తీస్తాయో అన్న చర్చ పార్టీ వర్గాల్లో జోరుగా సాగుతున్నది.**

కరీంనగర్, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన ప్రకారం.. స్థలం ఉన్న పేదలు ఇండ్లు నిర్మించుకునేందుకు ₹5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. మొదటి దశలో రాష్ట్రవ్యాప్తంగా 5.49 లక్షల ఇండ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టకున్నట్టు స్పష్టం చేసింది. పట్టణాలు వంటివి కాకుండా.. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి మొదటి విడుత కింద 3,500 ఇండ్ల నిర్మాణానికి అవకాశం కల్పిస్తున్నట్టు చెప్పింది. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాలోని 13 అసెంబ్లీ నియోజకవర్గాలకు 45,500 ఇండ్లను మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. అర్హులను ఎంపిక చేసేందుకు వార్డులు, డివిజన్ల వారీగా ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని ఈ నెల 11న రోడ్లు భవనాల శాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. నిబంధనల ప్రకారం ఈ నెల 19 నాటికి కమిటీల ఎంపిక పూర్తి కావాలి. ఒక్కో కమిటీలో ఏడుగురికి అవకాశం కల్పించిన ప్రభుత్వం.. ఎవరిని కమిటీల్లోకి తీసుకోవాలో స్పష్టంగా చెప్పింది. గ్రామ పంచాయతీల్లో అయితే సర్పంచ్ లేదా ప్రత్యేకాధికారి చైర్మన్‌గా, కార్యదర్శి కన్వీనర్‌గా ఉండాలని సూచించింది. స్వయం సహాయక సంఘాల నుంచి మరో ఇద్దరు, ఇంకో ముగ్గురు స్థానిక సభ్యులు ఉండాలని పేర్కొంది. అయితే ఆ ముగ్గురిలో వెనుకబడిన తరగతుల (బీసీ), దళిత (ఎస్సీ), గిరిజన (ఎస్టీ ) వర్గాల నుంచి ఒక్కొక్కరికీ అవకాశం కల్పించాలని స్పష్టం చేసింది. అలాగే మున్సిపల్, కార్పొరేషన్ పరిధిలోని వార్డు, డివిజన్ స్థాయి కమిటీల్లో కౌన్సిలర్, లేదా కార్పొరేటర్ చైర్మన్‌గా, వార్డు అధికారి కన్వీనర్‌గా ఉంటారు. స్వయం సహాయక సంఘాల గ్రూపు నుంచి ఇద్దరు, ముగ్గురు స్థానికులు సభ్యులుగా వ్యవహరిస్తారు. ఇక్కడా కూడా పంచాయతీ కమిటీలకు వర్తించిన రిజర్వేషన్లే వర్తిస్తాయి.

## 70 శాతం వార్డుల్లో డబుల్ జాబితాలు

ఉమ్మడి జిల్లాలో 1,214 పంచాయతీలుండగా 11,180 వార్డులున్నాయి. జిల్లాల వారీగా చూస్తే జగిత్యాలలో 383 జీపీలుండగా 3,500 వార్డులున్నాయి. పెద్దపల్లిలోని 263 పంచాయతీల్లో 2,472 వార్డులు, కరీంనగర్‌లోని 313 జీపీల్లో 2,966 వార్డులు, రాజన్న సిరిసిల్లలోని 255 జీపీల్లో 2,240 వార్డులున్నాయి. వీటితోపాటు ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీల్లో 351 వార్డులు, కరీంనగర్, రామగుండం కార్పొరేషన్లలో 110 డివిజన్లు ఉన్నాయి. ప్రస్తుత గణాంకాల ప్రకారం.. ఉమ్మడి జిల్లాలో పంచాయతీ, మున్సిపల్ వార్డులు, కార్పొరేషన్లు, డివిజన్లు కలిపి మొత్తం 11,646 ఇందిరమ్మ కమిటీలను నియమించాల్సి ఉన్నది. ఇప్పటికే ఆయా జాబితాలను సిద్ధం చేసిన పార్టీ నాయకత్వం, వాటిని ఆయా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లకు అందించింది. తాజాగా అందుతున్న సమాచారం మేరకు 70 వార్డులు, డివిజన్ల నుంచి రెండు లేదా అంతకుమించి జాబితాలు వచ్చినట్టు తెలుస్తున్నది.


## ఢీ అంటే ఢీ

ఇందిరమ్మ కమిటీల్లో మెజార్టీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ మధ్య ఢీ అంటే ఢీ అనే పరిస్థితి ఉన్నది. ఇప్పటికే కొన్నిచోట్ల అసంతృప్తులు బయటకు వస్తుండగా, మరికొన్ని చోట్ల ప్రచ్ఛన్న యుద్ధం నెలకొన్నది. ఇంకొన్నిచోట్ల అంతర్గతంగా రగులుతున్నా అధికారిక జాబితా వచ్చేవరకు వేచి చూసి, ఆ తర్వాత మాట్లాడుదామని చర్చించుకోవడం కనిపిస్తున్నది. జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గంలో పరిస్థితి మరీ దారుణంగా ఉన్నది. ఇక్కడ స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జీవన్‌రెడ్డి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటున్నది. ఇప్పటికే ఒకరిపై ఒకరు పై చేయి ఉన్నట్టు శ్రేణుల ముందు నిలువడానికి ఎవరి దారుల్లో వారు ప్రయాణం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి గ్రామంతో ఇందిరమ్మ ఇండ్ల కమిటీల్లో తమ వారినే నియమించుకోవాలన్న ఉద్దేశంతో ఇద్దరు వేర్వేరు జాబితాలు తయారు చేసి.. ఇటు అధికారులు, అటు ఇన్‌చార్జి మంత్రికి సమర్పించినట్టు తెలుస్తున్నది. అందులో ఎవరి జాబితాకు ఆమోదం తెలుపుతారన్న చర్చ ప్రస్తుతం జగిత్యాలలో హాట్‌టాపిక్‌లా మారింది. అంతేకాదు, సీనియర్ నాయకుడిగా తాను ప్రతిపాదించిన కమిటీలకు విలువ ఇవ్వకుంటే.. పార్టీ అధిష్టానంతో తాడోపేడో తేల్చుకునేందుకు జీవన్‌రెడ్డి సిద్ధమైనట్టు తెలుస్తున్నది. ఇదే తరుణంలో ఈ అవకాశాన్ని తనకు అనుకూలంగా మార్చుకొని, పై చేయి తనదే అని నిరూపించుకోవడానికి ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కూడా కీలకంగా వ్యవహరిస్తున్నట్టు తెలుస్తున్నది. దీంతో ఈ పరిస్థితులు ఎటువైపు దారితీస్తాయో.. అన్న చర్చ జరుగుతున్నది. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలోనూ అదే తీరు నెలకొన్నది. ఇక్కడ కొంత మంది కాంగ్రెస్ కార్పొరేటర్లు.. వారికి వారే జాబితా తయారు చేసుకొని అధికారులకు సమర్పించారు. అలాగే కాంగ్రెస్ నగర అధ్యక్షుడు, సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డితో ఆయన వర్గీయులు నగరంలోని 60 డివిజన్లలో ఒక జాబితా తయారు చేసి.. అధికారులతోపాటు ఇన్‌చార్జి మంత్రికి సమర్పించినట్టు తెలుస్తున్నది. నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్ కూడా మరో లిస్ట్ తయారు చేసి, తన జాబితాకే ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నారు. ఇదే సమయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ వర్గీయులు కూడా జాబితా సిద్ధం చేసి అధికారులకు సమర్పించడంతోపాటు పొన్నంకు, ఇన్‌చార్జి మంత్రికి ఇచ్చినట్టు తెలిసింది. అలాగే వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గంలో కొత్త వాళ్లకు కమిటీల్లో చోటు కల్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయని భావించిన కొంత మంది పాతనాయకులు.. కమిటీల్లో స్థానం దక్కించుకోవడానికి ఇన్‌చార్జి మంత్రిని కలిసి కొన్ని పేర్లను ఇచ్చినట్టు సమాచారం అందుతున్నది. హుజూరాబాద్ అసెంబ్లీ నియోజవకర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ పాత వాళ్లకు కాకుండా కొత్త వాళ్లకు అవకాశం ఇస్తున్నారని, ఈ నేపథ్యంలో ఆది నుంచీ పార్టీని పట్టుకొని ఉన్న వారికి అవకాశం కల్పించాలని కోరుతూ కొంత మంది ఇన్‌చార్జి మంత్రిని కలిసినట్టు పార్టీవర్గాల ద్వారా సమాచారం అందుతున్నది.

### భగ్గుమనే ముప్పు?

ప్రస్తుతం జాబితాలన్నీ ఇన్‌చార్జి మంత్రికి చేరాయి. సదరు మంత్రి ఆమోద ముద్రవేసిన తర్వాత ఆయా వార్డుల కమిటీలను అధికారికంగా ప్రకటించనున్నారు. అధికారిక జాబితా వస్తే కాంగ్రెస్‌లో విభేదాలు భగ్గుమంటాయన్న చర్చ ప్రస్తుతం ఆపార్టీలో నడుస్తున్నది. ప్రస్తుతం ఎవరూ వెళ్లినా.. మీకే కమిటీలో అవకాశం ఉంటుందని పై స్థాయి నాయకులు సర్దిచెబుతున్నారు. దీంతో సదరు నాయకులంతా అంతర్గతంగా కోపంతో ఉన్నా సమయం కోసం వేచి చూస్తున్నట్టు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో అధికారిక జాబితా వెలువడితే అసలు వ్యవహారం బహిర్గతం అవుతుందని, అప్పుడు కమిటీలొల్లి బజారున పడడం తప్పదన్న సంకేతాలను కొంత మంది క్షేత్రస్థాయి కాంగ్రెస్ నాయకులు ఇస్తున్నారు.

# ట్రా 'ఫికర్' ఇంకెన్నాళ్లు?



- నగరంలో ₹2.50 కోట్లు వెచ్చించినా పనిచేయని సిగ్నల్ వ్యవస్థ
- నెలలు గడుస్తున్నా ముందుకు సాగని పనులు

**కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ నుంచి వాహనదారులకు ఊరట కల్పించేందుకు ఏర్పాటు చేసిన సిగ్నల్ వ్యవస్థ ఇంకా పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడం లేదు. లైట్లు బిగించి నెలలు గడుస్తున్నా ఇప్పటికీ పనిచేయకపోవడంతో ట్రాఫిక్ చిక్కులు తప్పడం లేదు. ₹2.50 కోట్లు వెచ్చించినా ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయడం తలకు మించిన భారంగా మారుతున్నది. పెరిగిన వాహనాల రద్దీతో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కావడం లేదు. దీంతో పోలీసులకే కాదు, వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.**



నగరంలోని ఓ చౌరస్తా వద్ద అస్తవ్యస్తంగా వాహనాలు

రాంనగర్, అక్టోబర్ 23 : స్మార్ట్‌సిటీ ద్వారా వచ్చే నిధులతో నగరాన్ని విస్తృతంగా అభివృద్ధి చేయాలని భావించి కరీంనగర్ నగరపాలక సంస్థ ప్రణాళికలు సిద్ధం చేసింది. అందులో భాగంగా నగర సుందరీకరణతోపాటు ప్రజల భద్రత కూడా ముఖ్యమని భావించి ప్రధాన చౌరస్తాల్లో సిగ్నలింగ్ వ్యవస్థ, ప్రధాన రహదారుల వెంట అత్యాధునిక సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. స్మార్ట్‌సిటీ నిధులతో సిగ్నలింగ్ కమాండ్ కంట్రోల్‌ను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసి పోలీస్ శాఖకు అప్పగిస్తామని ప్రతిపాదనలు సిద్ధం చేసి ఆచరణలో పెట్టింది. అంతవరకు బాగానే ఉన్నా స్మార్ట్‌సిటీ కింద వచ్చే నిధులతో కమాండ్ కంట్రోల్, సిగ్నలింగ్ వ్యవస్థను మరో సంస్థకు మున్సిపల్ కార్పొరేషన్ అప్పగించింది. సదరు సంస్థ ప్రధాన రహదారుల వెంట సీసీ కెమెరాలు, ప్రధాన కూడళ్లలో సిగ్నలింగ్ లైట్లను ఏర్పాటు చేసింది. అయితే, అంతా పూర్తయ్యాక పోలీస్ శాఖకు అప్పగించడంలో మాత్రం నిర్లక్ష్యం చూపింది. ఇప్పటివరకు ఏర్పాటు చేసిన పనులకు బిల్లులు రాలేదని సీసీ కెమెరాలు, సిగ్నలింగ్ పర్యవేక్షణలో పూర్తి స్థాయి లోపాలు సరిదిద్దకుండానే ముఖం చాటేసింది. ఫలితంగా నగరంలోని 26 చోట్ల ఏర్పాటు చేసిన సిగ్నల్ లైట్లు ఎప్పుడు పని చేస్తాయో? ఎక్కడ పని చేస్తాయో? అర్థంకాని పరిస్థితి వచ్చింది. దీనికి తోడు సీసీ కెమెరాలు కూడా సరిగ్గా పనిచేయకపోవడంతో ₹కోట్లు ఖర్చుపెట్టి ఏర్పాటు చేసిన సిగ్నల్, సీసీ కెమెరాలు పోలీస్ శాఖకు ఇంకా అందుబాటులోకి రావడం లేదు. పెరిగిన నగర జనాభాకు అనుగుణంగా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు అదనంగా మరో స్టేషన్ ఏర్పాటు చేసేందుకు పోలీసు అధికారులు సిద్ధమవుతుండగా.. సంబంధిత సంస్థ మాత్రం సిగ్నల్ వ్యవస్థను మాత్రం పోలీస్ శాఖకు అప్పగించలేదు. దీంతో పోలీసులకు ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయడం తలకుమించిన భారం అవుతున్నట్టు తెలుస్తున్నది. ఒకప్పటికి ఇప్పటికి నగరంలో వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. ఏ రోడ్డు చూసినా ఫుల్ బిజీగా కనిపిస్తున్నది. ప్రధానంగా పండగ సమయాలు, ప్రత్యేక సందర్భాల్లో నగరం పద్మవ్యూహంలా మారుతున్నది. ఈ పరిస్థితుల్లో వాహనాలను అదుపు చేయడం సవాల్‌గా మారుతున్నది. ఇటు అడ్డదిడ్డమైన ట్రాఫిక్‌తో వాహనదారులు కూడా ఇబ్బంది పడుతున్నారు. సిగ్నలింగ్ వ్యవస్థ ఎంత త్వరగా అందుబాటులోకి వస్తే అంతే తొందరగా ట్రాఫిక్ సమస్య క్లియర్ అవుతుందని నగరవాసులు అభిప్రాయపడుతున్నారు.

## అందుబాటులోకి తీసుకువస్తాం

స్మార్ట్‌సిటీ కింద చేపట్టిన సిగ్నలింగ్ వ్యవస్థ పూర్తి చేసేందుకు మరికొంత సమయం పడుతుంది. పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చేందుకు కొన్ని సాంకేతికపరమైన సమస్యలు ఉన్నాయి. కాంట్రాక్టు నిర్వహిస్తున్న సంస్థతో ఎప్పటికప్పుడు పనులు పర్యవేక్షిస్తున్నాం. అత్యాధునిక టెక్నాలజీ ద్వారా సిగ్నలింగ్ వ్యవస్థను ఆపరేట్ చేసేందుకు సెన్సార్ పద్ధతిని ఉపయోగించనున్నాం. అందువల్లే కొంత జాప్యం జరుగుతున్నది. నిధుల కొరతేమీ లేదు.

**- రాజకుమార్, ఎస్ఈ**





గంగుల కమలాకర్ తల్లి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, మేయర్ సునీల్‌రావు, అంత్యక్రియల్లో మాజీ ఎంపీ వినోద్

# గంగుల మాతృమూర్తికి కన్నీటి వీడ్కోలు

నివాళులర్పించిన మాజీ మంత్రులు హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్

కరీంనగర్ కార్పొరేషన్, అక్టోబర్ 23 : మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాతృమూర్తి లక్ష్మీనర్సమ్మ అంత్యక్రియలు బుధవారం కరీంనగర్‌లో అశ్రునయనాల మధ్య నిర్వహించారు. అంతకుముందు మాజీ మంత్రులు హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ వినోద్ కుమార్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, తదితరులు లక్ష్మీనర్సమ్మ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం అంతిమయాత్రతోపాటు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. క్రిస్టియన్‌కాలనీలోని వారి స్వగృహం నుంచి సప్తగిరికాలనీలోని స్వర్గధామం వరకు జరిగిన అంతిమ యాత్రకు రాజకీయ నాయకులు, బంధువులు, గంగుల అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

# పోతుగల్ పీఏసీఎస్ భేష్

- రైతులకు అందిస్తున్న సేవలపై నాబార్డు బృందం ప్రశంసలు

ముస్తాబాద్, అక్టోబర్ 23: పోతుగల్‌లోని సహకార సంఘం ద్వారా రైతులకు అందిస్తున్న సేవలు బాగున్నాయని నాబార్డు బృందం సభ్యులు ప్రశంసించారు. ముస్తాబాద్ మండలం పోతుగల్ సహకార సంఘ భవనం, గోదాంను బుధవారం వారు సందర్శించారు. సంఘం ద్వారా రైతులకు అందిస్తున్న సేవలు, రుణాల వివరాలు, వ్యాపార కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. వ్యాపార, ఆర్థిక, ప్రభుత్వపరంగా సంఘం బలోపేతానికి నాబార్డు నుంచి మరింత సహకారం అందిస్తామని వెల్లడించారు. సంఘం ద్వారా రైతులకు అందిస్తున్న సేవలు బాగున్నాయని ప్రశంసించారు. గతంలో నష్టాల్లో ఉన్న సంఘాలు నాఫ్స్‌కాబ్ మాజీ చైర్మన్, కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు సహకారంతో లాభాల దిశలో ముందుకు సాగుతున్నాయని నాబార్డు బృందానికి పీఏసీఎస్ చైర్మన్ తన్నీరు బాపురావు వివరించారు. కార్యక్రమంలో నాబార్డు ఏజీఎంలు అభిషేక్, అఫ్సద్, బోస్టన్ గ్రూప్ ఇండియా ప్రతినిధి ఆర్యన్, కేడీసీసీబీ సీఈవో సత్యనారాయణరావు, పీఏసీఎస్ డెవలప్‌మెంట్ సేల్స్ మేనేజర్ సత్యనారాయణ, కేడీసీసీబీ జనరల్ మేనేజర్లు శ్రీధర్, రియాజ్, జిల్లా నాబార్డ్ డీడీఎం జయప్రకాశ్, కార్యదర్శి కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



కార్యాయంలో సేవలు అభివృద్ధిపై సూచనలు ఇస్తున్న నాబార్డు ప్రతినిధులు